# హృదయంలేని ప్రియురాలు

అవధానుల సుధాకరరావు

"ఛీర్స్!...."

మధువుతో నిండిన గ్లాసులు ముద్దాడుకున్నాయి.

కాస్త గొంతు తడుపుకొని, గ్లాసుని టేబుల్ మీద పెట్టాను. ప్రభాకర్ ఆఫర్ చేసిన సిగరెట్ ని తీసుకుని, పెదాల మధ్య పెట్టుకున్నాను. 'లైటర్'తో వాటికి వాడే అగ్ని సంస్కారం కూడా చేసాడు.

ఈ ప్రస్తుత పార్టీ అతనిదే. నేను కేవలం అతిధిని.

ఒక రౌండ్ పూర్తయ్యాక మా శారీరక స్థితి ఊగసాగింది.

ప్రభాకర్ చికెన్ ఫ్రై తింటూ, నాకో నెంబర్ చెప్పి దానికి ఫోన్ చెయ్యమని ఆడిగాడు.

"ఏమిటి సంగతి?" ఎదురు ప్రశ్నించాను.

"ఈ రాత్రికి మనకి స్వర్గసుఖాలందించడానికి పంచదార చిలకల్లాంటి కన్నెపిల్లలు రెక్కలు కట్టుకొని వాల్తారు." చెప్పాడు.

నాకో్కపం వచ్చింది. "ఇడియట్! పెళ్లాం పుట్టింటికి పొయ్యి ఇంకా ఇరవై నాలుగు గంటలయినా కాలేదు. అప్పుడే ఇంత తెగింపా" అని చివాట్లు పెడుతూ— "అయినా, వినా, పడం నా వల్లవుతుందా? కావాలనుకుంటే నీ ఒక్కడికోసం ఆ ఏర్పాటు చేసుకోవచ్చు" అని చెప్పాను.

ప్రభాకర్ నాకేసి జాలిగా చూస్తూ— "ఒరేయ్ ఫూల్! నా ముందారా నీ మేకపోతు గాంభీర్యం? ఎందుకురా ఇంకా ఆ కస్తూరి కోసం పడిచస్తావ్? అది నీ గుండెకి గాయం చేసినా, దాన్ని ఆరాధించడం ఇంకా మానవేం? ఈ లోకంలో కస్తూరిని తలదన్నేవాళ్ళు సవాలక్షమందిరా! ఆమె స్వార్థంతో నన దాని తను చూసుకున్నప్పటికీ నువ్వింకా ఆమె పిచ్చిలోంచి, ప్రేమ మైకంలోంచి బయటకురావేం" అని నన్ను బాగా దులిపేసాడు.

ఆ మాటలతో నా మనసు వికలమయి జ్ఞాపకాల్ని కెలికినట్లయింది.

ప్రేమ ఎంత మధురమో - ప్రియురాలు అంత కఠినం!

ఎటుచూసినా కస్తూరి రూపమే నిండి ఉంటూ....


నవ్వుతూ.... నవ్విస్తూ.... రా రమ్మని పిలుస్తూ.... నన్నందుకోమ్మని ఆహ్వానిస్తూ.... ప్రేరేపిస్తూ.... రెచ్చగొడుతూ.... చిలిపిగా, చెలిమిగా.... వలపుతో.... పగలతో....

ఆ స్మరంపరకి తట్టుకోలేక ఉక్కిరి బిక్కిరయ్యి గ్లాసెత్తి గటగటా మందు తాగేసాను.

❊ ❊ ❊

కస్తూరి చాలా విచిత్రంగా నా జీవితంలోకి ప్రవేశించింది. మా మొదటి కలయిక నాకింకా బాగా గుర్తుంది.

ఆ రోజు మహేశ్వరిలో కూలీ సినిమాకు వెళ్ళాను. ఆ థియేటర్ కి ఉన్న చెప్పుకోదగ్గ ఆకర్షణ- 'ఎస్కలేటర్'. దానిమీద నిలబడితే చాలు మెట్లెక్కే శ్రమ లేకుండా అది మనని



పైకి చేరుస్తుంది.

నా ముందు నిలబడి ఉన్న కస్తూరి ఏమరుపాటో లేక ఆ అనుభవం కొత్తకావడం వల్లనేమో శరీరం తూలి బ్యాలన్స్ తప్పి పూర్తిగా నా మీద పడి, నన్నల్లుకుపోయింది. నా స్థానంలో ఇంకో మగాడుంటే ఆ గోల్డెన్ ఛాన్స్‌కి పరవశించేవాడు. కానీ నేను వివేకంగా ఆమెని విడిపించుకున్నాను.

విచిత్రంగా సినిమా హాల్లో కూడా మావి పక్క పక్క సీట్లే అయినా నేనామె ఉనికిని అసలు పట్టించుకోలేదు.

సినిమా అయ్యేసరికి పదయింది. నేను ఆటో ఎక్కి కూర్చుని ఖైరతాబాద్ అన్చెప్పాను.

"మాస్టారూ! నేను కూడా అక్కడే...." ఆమె మాటలు ఆటో శబ్దంలో కలిసిపోయాయి.

* * *

ఓ వారం రోజుల వ్యవధి లోపలే ఆమె మళ్ళీ నాకు తారసపడింది. ఈసారి మేం కలుసుకున్న ప్రదేశం ఎగ్జిబిషన్. అంత జనసందోహంలో కూడా మేం పరస్పరం గుర్తించుకోగలగడం చెప్పుకోదగ్గ విషయమే.

అప్పుడు సమయం రాత్రి ఎనిమిదవుతోంది. ఉజ్వలంగా వెలిగిపోయే దీపాల కాంతిలో కస్తూరి తన సహజ సౌందర్యంతో ఆ పరిసరాలకే వన్నె తెస్తోంది.

"గురుగారూ! నన్ను రక్షించండి.... మీరే శరణు." నాకు చాలా సమీపంగా నడుస్తూ చెప్పింది.

ప్రశ్నార్థకమైన నా చూపులకి సమాధానంగా- "ఒంటరిగా ఈ చోటికి రావడం బుద్ధి తక్కువైంది. మహా ఇబ్బంది పెట్టేస్తున్నారు ఈ మగాళ్ళు..." అంది.

"మరి నేనూ మగాణ్ణే కదా!"

"నా దృష్టిలో వాళ్ళంతా చాలా 'చీప్' మనుషులండీ. మీకూ, వాళ్ళకి పోలికేంటి? మీకిష్టం ఉన్నా, లేకపోయినా మనిద్దరం కలిసి చూడాల్సిందే ఈ ఎగ్జిబిషన్" అంటూ పట్టుపట్టింది.

కాదనలేకపోయాను. అంతా తిరిగి, బయటికొచ్చాక "ఓపిక లేదు. కళ్ళు తిరుగుతున్నాయి బాబూ! ఏదైనా హోటల్‌కి తీసుకెళ్ళండి.... పుణ్యముంటుంది." అంది.

హోటల్ సంపూర్ణాకి వెళ్ళాం.

బిల్ ఇరవై దాకా అయ్యింది.

"డియర్ సర్! మీరేమనుకున్నా, ఈ ఛాన్స్ మాత్రం నాకివ్వాల్సిందే!" అని పర్సులో చెయ్యి పెట్టింది.

వెంటనే ఆమె ముఖంలో రంగులు మారాయి..

"ఏమయ్యింది?" అనడిగేను.

"పర్సులో డబ్బు పోయింది." కీచు గొంతుతో చెప్పింది.

"నో ప్రాబ్లెం" అన్నాను.

ఇద్దరం ఆటోలో ప్రయాణిస్తుంటే తను చాలా ఫీలవుతూ "నా బాడ్‌లక్ సర్ ఇదంతా మీ అడ్రసివ్వండి. రేపే ఎం.ఓ. చేస్తాను." అని చెప్పి, నా అడ్రసు డైరీలో రాసుకుంది.

ఆ రాత్రి కస్తూరి నా ఆలోచనల్లో, కలల్లో కూడా చోటుచేసుకుంది.

ఓ అందమైన ఆడపిల్ల నా కోసం అంతలా ఆరాటపడ్డం కాస్త గర్వంగా తోచింది. ఆమె నాతో చాలా సన్నిహితంగా ప్రవర్తించిందా రోజున.

జయింట్‌వీల్ ఎక్కినప్పుడు- "భయమేస్తుంది...." అంటూ నన్ను హత్తుకుపోయిన సన్నివేశం పదే, పదే కళ్ళముందు మెదిలింది.

జీవితంలో తొలిసారి స్త్రీ స్పర్శ నాలో అలజడి రేపింది.

* * *

ఆ తరువాత ఆమె దగ్గర్నించి ఎం.ఓ. రాలేదు కాని రెండు పేజీల రసవత్తరమైన ప్రేమలేఖ అందింది. దాంతో ఆమె నన్ను పూర్తిగా గెల్చుకుంది.

చెట్టాపట్టాలేసుకుని సిటీలో అన్ని ప్రదేశాలకీ తిరగసాగేం. మేమిప్పుడు ప్రేమికులం. ప్రపంచమంతా రంగులమయం మా కళ్ళకి.

* * *

'ఇందిరాపార్క్'లో బోట్ షికారు చేసొచ్చి, జనసంచారానికి దూరంగా ఓ పొదమాటున కూర్చున్నాం.

"రవీ.... అటు చూడు-" కస్తూరి చెప్పిన దిశగా చూసాను. మాలాగే ఓ ప్రేమికుల జంట- అయితే వాళ్ళు కాస్త ముందుకెళ్ళి "రొమాన్స్" జరుపుకుంటున్నారు.

"తప్పు ... అలా చూడకూడదు...."

"ఏం చెయ్యను....? కనీసం, అలాంటి సన్నివేశాలు దొంగచాటుగా చూసైనా తృప్తి పడకపోతే...." నా ఒంట్లో సంచలనం చోటు తీసుకొమ్మని ఆమె పరోక్షంగానే అయినా- చాలా స్పష్టంగా చెబుతోంది. కానీ నా విచక్షణ సమ్మతించొద్దూ....?

* * *

కస్తూరితో కలిసి సినిమా చూట్టం- నాకు పెద్ద సంకటంగా ఉంటుంది. చిలిపి తనం, అల్లరికి హద్దుండదు. తను సినిమా చూడదు- నన్ను చూడనివ్వదు.

నా చేతుల్ని తన గుండెల మీదకు చేర్చుకుంటుంది. ముద్దులొలికే మాధుర్యంతో నన్ను ఉత్తేజితుణ్ణి చేస్తూ ఉంటుంది. చివరికి నేను కూడా వశం తప్పి- ఆమె చేష్టలకి ప్రతిగా, ఆమెని అలరించేవాణ్ని.


* * *



## అంజాద్ తొలిచిత్రం

అంజాద్‌ఖాన్ మొదటి చిత్రం "షోలే" అని చాలామంది అనుకుంటుంటారు. అయితే దీర్ఘకాలనిర్మాణం జరిగిన కె. ఆసిఫ్ చిత్రం "లవ్ అండ్ గాడ్"లో 1963లోనే అంజాద్ తొలిసారి నటించాడు. నల్ల బావిపగా మొదటి చిత్రంలో నటించిన అంజాద్ "షోలే"లో తన ప్రతిభను ప్రేక్షక లోకానికి చూపాడు.

-ఏ



ఓ "వర్కింగ్ డే" రోజున, ఆఫీసుకు సెలవు పెట్టి- కస్తూరితో "గండిపేట" విహారానికి వెళ్ళాను. వాతావరణం మబ్బుపట్టి.... చల్లని గాలులు వీస్తూ, ఆహ్లాదకరంగా ఉంది. "స్కూటర్"ని కాటేజ్ దగ్గర పార్క్ చేసి, కట్టమీద నుంచి అలా సరదాగా చాలా దూరం నడుచుకుంటూ వెళ్ళాం.

వర్షం చినుకులు మొదలయ్యాయి. నేను పరుగెత్తుదామంటే కస్తూరి ఒప్పుకోలేదు.

"వయసులో వున్న ఓ అబ్బాయి- ఓ అమ్మాయి ఇలా వర్షంలో తడుస్తూ, దగ్గర దగ్గరగా నడుస్తుంటే- ఆ అనుభూతి అనిర్వచనీయం...." అంటూ ఆ వానజల్లులో నాకు అతుక్కుపోయి, నా అడుగులో అడుగేస్తూ నడవసాగింది.

శరీరంలో చలి- మరోపక్క ఆమె అందిచే వేడి.... ఆమె స్తనాల ఒత్తిడి- నన్ను కఠిన పరీక్షకి గురి చేస్తున్నాయి.

"కాటేజ్"కి వచ్చేసరికి పాంతం తడిసిపోయాం, బట్టలన్నీ ముద్దయినాయి.

ఇద్దరి శరీరాల్లోనూ వణుకు.

ఆమె కాటుక కళ్ళు నన్ను ఆహ్వానిస్తున్నాయి. నేను మృదువుగా, మౌనంగా ఆమె కోరికకి "నో" అన్నాను.

కస్తూరి ఏం మాట్లాడకుండా తన ఒంటి మీది ఓణీ తొలగించింది.

నేను అయోమయంగా చూస్తుంటే వెంటనే మిగతా ఉడుపులు కూడా తీసేసి, సంపూర్ణ నగ్నంగా నా కళ్ళెదుట నిలిచింది.

ఆ బంగారు ప్రతిమ- నన్ను లొంగదీసుకుంది. అపురూపమైన ఆమె నవ యవ్వన విగ్రహం నా నిగ్రహాన్ని పటాపంచలు చేసింది.

ఎక్కడో 'ఢాం' అని పెద్దగా పిడుగు పడిన శబ్దం. ఆమె భయంతో పరుగున వచ్చి నన్ను బల్లిగా కరుచుకుపోయింది. నాలో మంటలు.... జ్వాలలు.... తీవ్రమైన తమకంతో, రెచ్చిపోయిన ఉద్రేకంతో కామంతో ఊగిపోతూ కస్తూరి నగ్న శరీరాన్ని నా కౌగిట్లో బంధించి నలిపివేసాను.

గాలికి సైతం చోటులేని గాఢమైన ఆలింగనం అది. ఆమె అవయవాలన్నింటిని చుంబిస్తూ, ఒంపుసొంపుల్ని దంతక్షతాలతో గుర్తులు చెక్కుతూ.... ఆమె వెన్నెలా కరిగిపోతూ, తియ్యని బాధని మోయలేక మెలికలు తిరిగిపోతూ....

నేనూ వివస్త్రుడనై, ఇద్దరం మంచం మీదకు చేరి ఒకరిలో ఒకరం ఐక్యం కాబోయే తరుణంలో హఠాత్తుగా బయట్నుంచి వాచ్‌మెన్ కొంపలు మునిగిపోతున్నట్లు దబదబా తలుపు బాదసాగేడు.

ఈ చిన్న అవకాశంతో నిగ్రహం మళ్ళీ నా గుప్పిట్లోకి వచ్చేసింది.

కస్తూరి నన్ను తనమీద నుంచి లేవనియ్యక పోవడంతో బలంగా విదిలించుకున్నాను.

రసభంగంతో ఆశాభంగం చెందిన ఆమె నన్ను నానా శాపనార్థాలు పెట్టింది.

ఆమె శ్రేయస్సు గురించే నేను అపూర్వమయిన ఈ అవకాశాన్ని అతి కష్టం మీద వదులుకున్నానని ఆమె అర్థంచేసుకోలేకపోయింది.

* * *

ఆ వెంటనే నేను ట్రయినింగ్ నిమిత్తం ఓ నెలపాటు మద్రాసు వెళ్ళాల్సివచ్చింది. అందువల్ల ఈ మధ్యలో కస్తూరిని కలుసుకోలేకపోయాను.

తిరిగొచ్చేసరికి ఆమెకు పెళ్ళయిందన్న షాకింగ్ న్యూస్ తెలిసి మ్రాన్పోయాను.

'కస్తూరీ.... నేనేం కావాలనుకున్నావ్?' ఆమె కనిపిస్తే ఈ ప్రశ్న అడిగేఉండేవాడిని.

ఒకరోజు గ్రామర్ స్కూల్ దగ్గర ఆమె చిన్నతమ్ముడు కనిపించేడు.

"అంకుల్! మీరు ప్రజెంట్ చేసిన తాజ్ మహల్ బొమ్మని మా అక్క పెంటకుప్ప మీదకు విసిరిపారేసింది. ఎందుకని అంకుల్?"

ఆ పసివాడి ప్రశ్నకు జవాబు చెప్పవలసింది నేనా....?

* * *

ఒకరోజు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో నా ప్రణయ దేవతని చూసే భాగ్యం కలిగింది. అప్పుడామె భర్త కూడా పక్కనే ఉన్నాడు.

ముందుగా ఆమె నన్ను దూరం నుంచి చూసి, పిలిచి తన భర్తని పరిచయం చేసింది.

"ఈయన మా వారు. పేరు రమేష్. ఫ్లయిట్‌లో ఢిల్లీ వెళ్తున్నాం. అక్కడ్నుంచి కాశ్మీర్...." అతిశయం, గర్వం ఆమె మాటల్లో.

అతను నాకంటే వెయ్యిరెట్లు బాగున్నాడు. బాగా డబ్బున్న మనిషి కాబోలు. అందుకేనేమో నన్ను మనసులోంచి తొలగించి కస్తూరి అతన్ని మనువాడింది.

"కస్తూరీ! హూ ఈజ్ హి?" ఆమె భర్త ప్రశ్నించేడు.

కస్తూరి నన్ను తృణప్రాయంగా చూస్తూ "సెంటిమెంటల్ ఫూల్!" అని చెప్పింది.

నా కళ్ళముందే వాళ్ళు చెయ్యి చెయ్యి కలుపుకొని ముందుకెళ్ళిపోయారు.

* * *

'కస్తూరీ! నిన్ను ద్వేషించలేను. మరచిపోలేను. ఇంకో స్త్రీని నా జీవితంలోకి పిలవనూ లేను.

మనిద్దరికీ పెళ్ళికాకపోయినా, మొగుడూ-పెళ్ళాలుగా మనం సహజీవనం చెయ్యకపోయినా ప్రేమికులుగా మనం పొందిన మధురానుభవాలు పరిమళభరితమై- నీ తీపి జ్ఞాపకాలు నిత్యనూతనమై ఎప్పటికీ నన్ను నీపట్ల అనురక్తుడిగానే ఉంచుతాయి.'

నేను వాస్తవంలోకి వచ్చేసరికి ప్రభాకర్ మందెక్కువై సోయిలేకుండా పడిఉన్నాడు.

ఆ స్థితిలో కూడా వాడు ఏదో కలవరించడం నాకాశ్చర్యమనిపించింది.

"....ఒరేయ్ రవీ! కస్తూరి నిన్ను మోసం చేసిందిరా! నీతో ఆడుకుంది. ఆ వంచకి నీ ప్రేమకి అనర్హురాలు"

మా స్నేహపు ఔన్నత్యం నన్ను స్పందింపచేసి, కళ్ళని తడిచేసింది.

కస్తూరి, ప్రభాకర్ నాకు రెండు కళ్ళు. అందులో ఒక కన్ను పోయి అంధుణ్ణయ్యాను. ప్రభాకర్ వల్ల కొద్దో, గొప్పో ఈ ప్రపంచాన్ని ఒంటికంటితో చూస్తూ బ్రతుకు ఈడుస్తున్నాను. ●

